1St Year Happy Work Anniversary.

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 2 సంచిక : 275 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 13 సెప్టెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 275 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 13 September 2025 PAGES : 8 PRICE : 3/-

# 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు



- వే2న్యూస్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పై ప్రణాళిక ఆవిష్కరణ
- 2034 నాటికి రూ. 57 లక్షల కోట్ల జీఎస్‌డీపీ సాధనే లక్ష్యం
- ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ. 10 లక్షలు దాటించడమే టార్గెట్
- సూపర్ సిక్స్‌తో సంక్షేమం, ప్రణాళికలతో అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలేనని ధీమా వ్యక్తం చేసిన సీఎం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యమని, ఇందుకోసం ఒక స్పష్టమైన, బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 2034 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని రూ. 57 లక్షల కోట్లకు, ప్రతి వ్యక్తి తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు చేర్చడమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'వే2న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను ఆవిష్కరించి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. -మిగతా 2లో

# ట్రంప్ సుంకాలతో ఉద్యోగాలు పోతున్నాయ్ - శశిథరూర్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 12)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు భారత్‌పై ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పేర్కొన్నారు. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని అన్నారు. ట్రంప్ వ్యవహారశైలి, స్వభావం పూర్తి గందరగోళంగా ఉందంటూ మండిపడ్డారు. సింగపూర్‌లో క్రెడాయ్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను అమెరికా అధ్యక్షుడు గౌరవించడం లేదన్నారు. 'ట్రంప్ కన్నా ముందు 44 లేదా 45 మంది అధ్యక్షులుగా పనిచేసినప్పటికీ.. వైట్‌హౌస్ నుంచి ఈ రకమైన ప్రవర్తన ఎన్నడూ చూడలేదు. ఏ రకంగా చూసినా ఆయనఅసాధారణ అధ్యక్షుడు. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ఆయన గౌరవించడం లేదు. నోబెల్ శాంతి బహుమతికి అరుడనని ఏ దేశాధినేత అయినా చెప్పడం విన్నామా? ప్రపంచంలోని అన్ని దేశాలు మా వద్దకే వచ్చి మోకరిల్లుతాయని చెప్పడం విన్నామా? భారత్, రష్యాలవి డెడ్ ఎకానమీలు అని చెప్పడం ఎప్పుడైనా విన్నామా? ఓ దేశాధ్యక్షుడి నుంచి వినిపించకూడని భాష ఇది. అందుకే ఆయనో అసాధారణ వ్యకి. ట్రంప్ ప్రవర్తన ద్వారా మా పనితీరును నిర్ణయించవద్దు" అని దాదాపు 1000 మందికిపైగా రియల్ ఎస్టేట్ డెవలపర్లు, కన్సల్టెంట్‌లు పాల్గొన్న ఈ సమావేశంలో శశిథరూర్ విజ్ఞప్తి చేశారు. -మిగతా 2లో

# అమరావతి అసాధ్యం.. విజయవాడ-గుంటూరు మధ్య కట్టండి

ప్రభుత్వానికి సజ్జల సలహా

అమరావతి నిర్మాణం రాష్ట్రానికి తలకు మించిన భారమన్న సజ్జల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంపై వైసీపీ తమ వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. అమరావతిని ప్రస్తుత ప్రదేశంలో నిర్మించడం రాష్ట్రానికి ఆర్థికంగా పెనుభారమని, ఇది ఆచరణ సాధ్యం కాదని పేర్కొంది. దీనికి బదులుగా, విజయవాడ-గుంటూరు నగరాల మధ్య రాజధానిని నిర్మిస్తే -మిగతా 2లో

# వైకాపా అసత్య ప్రచారాలను సహించం: మంత్రి కొల్లు రవీంద్ర



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

అసత్య ప్రచారాలతో వైకాపా రెచ్చగొడితే ఊరుకునేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధిపై మాట్లాడే నైతిక అరత మాజీ సీఎం జగన్‌కు ఏమాత్రం లేదన్నారు. సూపర్ సిక్స్ సూపర్‌హిట్ సభ విజయవంతం కావడాన్ని వైకాపా తట్టుకోలేక పోతోందని విమర్శించారు. నిర్మాణమే చేపట్టని వైద్య కళాశాలలకు జగన్ పేరు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి 22 వైద్య కళాశాలలు తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకు -మిగతా 2లో

# పాక్ ఫేక్ బుద్ధి మారేదెప్పుడో.. 'ఆపరేషన్ సిందూర్'పై ఇంకా దుష్ప్రచారమే




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 12)

భారత్‌కు వ్యతిరేకంగా రచిస్తున్న కుట్రలు ప్రపంచం ముందు బట్టబయలవుతున్నా.. పాకిస్థాన్ తన వంకర బుద్ధిని మాత్రం మార్చుకోవడంలేదు. 'ఆపరేషన్ సిందూర్'సమయంలో పెద్దఎత్తున దుష్ప్రచారానికి తెరలేపిన పాకిస్థాన్.. ఇంకా దాన్ని కొనసాగిస్తూనే ఉంది. పాకిస్థాన్, దాని అనుకూల సోషల్ మీడియా ఛానెళ్ల వేదికగా భారత్‌పై విషం చిమ్ముతోంది. ఏఐ జెనరేటెడ్ నకిలీ వీడియోలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే దుష్ట ప్రయత్నాలు చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్రవాదుల పీచమణిచేందుకు భారత్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు నష్టం వాటిల్లినట్లుగా భారత ఆర్మీ చీఫ్‌లు, సైనిక అధికారులు మాట్లాడుతున్నట్టు చిత్రీకరించిన ఏఐ నకిలీ వీడియోలను విస్తృతంగా షేర్ చేస్తోంది. అదే పనిగా పాకిస్థాన్ భారత్‌పై కొనసాగిస్తున్న ఫేక్ ప్రచారం పట్ల ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తోన్న పీఐబీ ఫ్యాక్ట్ -మిగతా 2లో

# భారత సైనికుల్ని కరిగించేందుకు చైనా ఆయుధాలు



అమెరికా సెనెటర్ సంచలన వ్యాఖ్యలు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 12)

అమెరికా సెనెటర్ బిల్ హాగెర్టీ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత సైనికులను కరిగించేందుకు చైనా విద్యుదయస్కాంత ఆయుధాలను వాడిందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఐదేళ్ల కిందట సరిహద్దు ఘర్షణ సందర్భంగా డ్రాగన్ వాటిని మోహరించిందని పేర్కొన్నారు. పరోక్షంగా గల్వాన్ ఘర్షణను ప్రస్తావించారు. "సుదీర్ఘకాలంగా చైనా, భారత్ మధ్య సంబంధాలు విశ్వాసలేమితో కొనసాగుతున్నాయి. ఐదు సంవత్సరాల క్రితం వివాదాస్పద సరిహద్దు వద్ద ఘర్షణపడ్డాయి. అప్పుడు చైనా విద్యుదయస్కాంత ఆయుధాలను ఉపయోగించింది" అని బిల్ వ్యాఖ్యలు చేశారు. భారత్-చైనా సైనికుల మధ్య 2020లో గల్వాన్ లోయలో ఘర్షణ జరిగింది . ఈ సమయంలో ఇరు దేశాల సైనికులు రాళ్లు, కర్రలతో తలపడ్డారు. ఈ ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు అమరులయ్యారు. తమవైపు ఐదుగురు సైనికులు మరణించినట్లు చైనా చెప్పింది. అయితే మృతుల సంఖ్య అంతకంటే ఎక్కువే ఉండొచ్చని పలు అంతర్జాతీయ -మిగతా 2లో

# జగన్ మానసిక పరిస్థితిపై అనుమానం ఉంది

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి వైఎస్ జగన్ ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వైకాపా కేవలం 11 సీట్లకు పరిమితమవడంతో ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లను జగన్ బెదిరిస్తున్నారని.. ఆయన మానసిక పరిస్థితిపై అనుమానం ఉందని వ్యాఖ్యానించారు. విశాఖ ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గంటా మాట్లాడారు.



"అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్.. సూపర్‌హిట్ సభ విజయవంతమైంది. చెప్పిన మాట చేసి చూపిస్తే ఎలా ఉంటుందో చెప్పేందుకు ఆ సభ ఉదాహరణ. జగన్ తీరు దారుణంగా ఉంది. సీఎం, హోం, వ్యవసాయ మంత్రులపై ఇష్టారీతిన ఆయన మాట్లాడారు. జగన్ ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. 18 సీట్లు వస్తే తప్ప ఆ హోదా రాదు. వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావు. -మిగతా 2లో

# నేపాల్ పార్లమెంట్ రద్దు.. తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 12)

సంక్షోభం ఎదుర్కొంటున్న నేపాల్ తాత్కాలిక ప్రధాని ఎవరన్న దానిపై ఉత్కంఠ వీడింది. తాజాగా ఆ దేశ పార్లమెంట్ రద్దయింది. మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కిను నేపాల్ తాత్కాలిక సారథిగా జన్ జడ్ ఉద్యమకారులు ఎంపిక చేశారు. అధ్యక్షుడి ఆమోదం కోసం ఆమె పేరును పంపారు. మరికాసేపట్లో సుశీల ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఎవరీ కర్కి..? సుశీలా కర్కి (72)కి నేపాల్ చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. నిర్భయంగా, సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మరకలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009లో సుప్రీంకోర్టులో అడుగుపెట్టి.. శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టి.. నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. తాజా ఉద్యమంలోనూ ఆమె కీలక పాత్ర పోషించారు.

## 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “కేవలం విజన్ రూపొందించడంతోనే సరిపెట్టకుండా, దాన్ని ఆచరణలో సాధ్యం చేసే దిశగా పనిచేయాలి. జాతీయ స్థాయిలో ‘వికసిత్ భారత్–2047’కు అనుగుణంగా రాష్ట్రంలో ‘స్వర్ణాంధ్ర–2047’ విజన్‌ను సిద్ధం చేశాం. ఈ లక్ష్యాలను సాధించడం అసాధ్యమేమీ కాదు. కచ్చితమైన ఆలోచన, బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే” అని అన్నారు. రాష్ట్రంలోని భాగస్వాములందరినీ కలుపుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను ఆయన ప్రజల ముందుంచారు. “ఈ ఏడాది, గత ఏడాది రెండంకెల వృద్ధి సాధించగలిగాం. ఇదే స్ఫూర్తితో 2028–29 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీని రూ. 29.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 5.42 లక్షలకు చేరుస్తాం. ఆ తర్వాత, 2034 నాటికి జీఎస్‌డీపీని రూ. 57.21 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు పెంచేలా ప్రణాళికలు రూపొందించాం. ఈ మెగా డ్రీమ్‌ను నిజం చేసే బాధ్యతను ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది” అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ, “ఒకప్పుడు భారతీయులకు ప్రపంచంలో సరైన గుర్తింపు లేని సమయంలో, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతి పరుగులు పెట్టింది. 2038 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్–1 స్థానానికి చేరుకుంటుంది. ఇందులో తెలుగువారి పాత్ర కీలకంగా ఉండాలి” అని ఆకాంక్షించారు. తాను గతంలో అమలు చేసిన విజన్ 2020 సాకారమైన తర్వాత కూడా ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని చంద్రబాబు స్పష్టం చేశారు. “భారత్ లాంటి దేశంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలి. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, సంపద సృష్టి ద్వారా అభివృద్ధికి సమానంగా నిధులు కేటాయిస్తాం. నేను కేవలం రాజకీయాల గురించే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదు, విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టించి, దాన్ని పేదలకు పంచుతున్నాం” అని వివరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవుతారని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతుందని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అమరావతి అసాధ్యం.. విజయవాడ–గుంటూరు మధ్య కట్టండి

రాష్ట్రానికి మేలు జరుగుతుందని, శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వానికి కీలక సూచన చేసింది.

వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ, అమరావతి నిర్మాణంపై చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును విమర్శించారు. “అమరావతి ప్రాంతం నదీ గర్భంలా ఉంది. అక్కడ భవనాలు కట్టాలంటే పునాదుల కోసమే వందల అడుగుల లోతుకు వెళ్లాలి. దీనివల్ల నిర్మాణం ఖర్చు తలకు

## మొదటి పేజీ తరువాయి

మించిన భారంగా మారి, రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెడుతుంది” అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాష్ట్రాన్ని పణంగా పెట్టారని ఆరోపించారు.

ఈ ఆర్థిక భారం నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకే జగన్ ఆచరణాత్మకమైన సలహా ఇస్తున్నారని సజ్జల తెలిపారు. “విజయవాడ–గుంటూరు మధ్య రాజధానిని నిర్మిస్తే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. మచిలీపట్నం పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం వల్ల ఆ ప్రాంతం ఒక మహానగరంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది” అని ఆయన వివరించారు.ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవికంగా ఆలోచించి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేయకుండా ఈ పరిష్కారాన్ని స్వీకరించాలని సజ్జల కోరారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళితే, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మళ్లీ కొత్త ఆలోచనలు చేయాల్సి వస్తుందని, వికేంద్రీకరణ వంటివి మరో రూపంలో తెరపైకి వచ్చే అవకాశం ఉంటుందని పరోక్షంగా హెచ్చరించారు. రాజధాని భవిష్యత్తుపై తుది నిర్ణయం చంద్రబాబు చేతుల్లోనే ఉందని... రాష్ట్రాన్ని కాపాడతారో, లేదో ఆయనే తేల్చుకోవాలని సజ్జల వ్యాఖ్యానించారు.

## వైకాపా అసత్య ప్రచారాలను సహించం: మంత్రి కొల్లు రవీంద్ర

దక్కుతుందన్నారు. మెడికల్ కళాశాలల పేరుతో జగన్ రూ.6 వేల కోట్లు అప్పు చేశారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే టెండర్లు రద్దు చేస్తామని వైకాపా నాయకులు బెదిరిస్తున్నారని మంత్రి రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాక్ ఫేక్ బుద్ధి మారేదెప్పుడో.. ‘ఆపరేషన్ సిందూర్’పై ఇంకా దుష్ప్రచారమే

చెక్ విభాగం. తాజా దుష్ప్రచారంపైనా స్పందించింది. ఈ నకిలీ వీడియో సామాన్య ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ఉందని, ఇలాంటి ఫేక్ వీడియోలను ఎవరూ షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. ఏవైనా అనుమానిత కంటెంట్‌ను గుర్తిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం వాట్సప్ నంబర్ 8799711259కు లేదా, కు మెయిల్ ద్వారా పంపాలని సూచించింది.

## భారత సైనికుల్ని కరిగించేందుకు చైనా ఆయుధాలు

మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటన తర్వాత రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల కాలంలో రెండు దేశాల సంబంధాలు కాస్త మెరుగుపడుతోన్న వాతావరణం నెలకొంది. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ గతేడాది కీలక గస్తీ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ క్రమంలోనే కొన్ని రోజుల క్రితం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏడేళ్ల తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఎస్‌సీఓ సదస్సులో పాల్గొన్నారు. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగిస్తోన్న తరుణంలో ఈ పర్యటన జరిగింది. ఇది అమెరికాకు షాకిచ్చింది. ఈ నేపథ్యంలోనే సెనెటర్ వ్యాఖ్యలు రావడం గమనార్హం.ఇదిలా ఉంటే.. భారత్‌ను చైనాకు దూరం చేసి యూఎస్‌కు దగ్గర చేసుకోవడమే తమ ప్రాధాన్యమని దీనికిముందు అమెరికా రాయబారి సెర్గీ గోర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వం, అక్కడి ప్రజలతో యూఎస్ సంబంధాలు దశాబ్దాల నాటివన్నారు. చైనీయులతో కంటే తమతోనే వారికి గొప్ప స్నేహం ఉందన్నారు. తమ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్‌జీ కోసం భారత్ ప్రధాన మార్కెట్ కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొనసాగుతున్న వాణిజ్య చర్చలు (%ఊజీబిఖిలి ఊబిజిదిరీ%) కూడా ఆ దిశగానే ఉన్నాయన్నారు.

## జగన్ మానసిక పరిస్థితిపై అనుమానం ఉంది

వైకాపా హయాంలో నర్సీపట్నంలో వైద్యకళాశాలను కేవలం 8 శాతమే పూర్తిచేశారు. పార్టీ కార్యాలయాలు తప్ప జగన్ ఇంకేమీ నిర్మించలేదు”“రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారు. ఆ ఖర్చు మెడికల్ కాలేజీలపై పెట్టి ఉంటే అవి పూర్తయ్యేవి. వైకాపా ఐదేళ్ల పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధం. గత ప్రభుత్వం కంటే అధిక మొత్తంలో పింఛను అందిస్తున్నాం. దివ్యాంగులకు పింఛను పెంచి ఇస్తున్నాం. విశాఖకు పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. నేపాల్‌లో తెలుగువాళ్లు చిక్కుకుంటే మంత్రి నారా లోకేశ్ నిరంతరం పర్యవేక్షించి వారిని రాష్ట్రానికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టారు” అని గంటా శ్రీనివాసరావు అన్నారు.

## ట్రంప్ సుంకాలతో ఉద్యోగాలు పోతున్నాయ్ – శశిథరూర్

ఉద్యోగాలపై ఎఫెక్ట్..“సుంకాల ప్రభావం భారత్‌పై చూపిస్తోంది. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. సూరత్‌లోనే ముత్యాలు, ఆభరణాల వ్యాపారంలో 1.35లక్షల మందికి లేఆఫ్‌లు విధించారు. సముద్రపు ఆహారం, తయారీ రంగంలోనూ ఈ ప్రభావం కనిపిస్తోంది. టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. అనేక ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోయాయి. అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడం కష్టంగా మారింది” అని థరూర్ పేర్కొన్నారు. అయితే, అమెరికాతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తుండటం మంచి పరిణామమేనన్నారు. అమెరికా సుంకాల ప్రభావాన్ని తగ్గించేందుకు ఇతర మార్కెట్లకూ మన ఎగుమతులను విస్తృత పరచాల్సిన అవసరం ఉందన్నారు.

## పిన్నెల్లి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జూలకంటి తండ్రి ఎరువుల కుంభకోణంపై సవాల్ కు సిద్ధమా

### త్వరలో వరికపూడిశెల నిర్మాణానికి శంకుస్థాపన
### నిధులు కేటాయింపులపై కృతజ్ఞులు
### మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 12)**

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి యూరియా కొరత, పంపిణీ పై చర్చకు రావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సవాల్ విసిరారు. శనివారం స్థానిక కెసిపి గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఉందని కృత్రిమ పోరాటం చేస్తూ వైసీపీ రైతులను తప్పుదోవ పట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో అన్ని సొసైటీలు, మార్కెట్ యార్డ్ లు, మార్క్ ఫెడ్, గ్రోమోర్ సెంటర్ల నందు వందల మెట్రిక్ టన్నులు యూరియా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి.. రైతుల కోసం మొసలి కన్నీరు కార్చడం ఆశ్చర్యమని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవను సమర్ధవంతంగా అమలు చేసి, రైతు బాంధవుడుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచారని చెప్పుకొచ్చారు.

**నీ తండ్రి ఎరువుల కుంభకోణంపై సవాల్ కు సిద్ధమా?**

వైసీపీ ప్రభుత్వంలో నీ ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకొని మీ తండ్రి వెంకటేశ్వరరెడ్డి, పిన్నెల్లి హనిమిరెడ్డి చేసిన ఎరువులు, యూరియా కుంభకోణంపై సవాల్ కు సిద్ధమా అంటూ పిన్నెల్లిని నిలదీశారు. ఎమ్మెల్యే జూలకంటి. వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఎరువులు ఎలా బ్లాక్ మార్కెట్ లో అమ్ముకున్నారో లెక్కలు బయట పెట్టమంటావా అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయంలో పత్తి, కంది పంటల అమ్మకాల్లో జరిగిన అవినీతిపై త్వరలో రామకృష్ణారెడ్డి అండ్ కో పై ఆధారాలతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలానే పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి రైతులను అన్ని విధాలుగా సర్వనాశనం చేసి.కృత్రిమ పోరాటాలు చేస్తున్నారని, రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన దుర్మార్గపు పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు.

**త్వరలో వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన**

వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు వచ్చే అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతులు మీదిగా శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని, త్వరలో తేదీని ప్రకటిస్తామని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. ఏడు దశాబ్దాలకు పల్నాటి ప్రజల కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మొదటి ఫేజ్ పనులకు సంబంధించిన నిధులు రూ. 340. 26 కోట్లను ఇప్పటికే విడుదల చేశారని.రెండో ఫేజ్ కు సంబంధిన అటవీ,పర్యావరణ అనుమతులకు పత్రాలు సిద్ధం చేసి కేంద్రానికి పంపామని వివరించారు. లక్ష ఎకరాల సాగు స్థిరికరణే లక్ష్యంగా వరికపూడిశెల ప్రాజెక్ట్ రూపకల్పన జరుగుతోందని జూలకంటి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మధు, పార్టీ సినియర్ నాయకులు మద్దిగపు వెంకటరామిరెడ్డి, గోగుల వెంకటరామిరెడ్డి, గుండా శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు కృష్ణవేణి, మంజుల అంజి, పీర్ తదతరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి ఎమ్మెల్యే దామచర్లకు మొరపెట్టుకున్న ఆర్పీలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)**

ఒంగోలు నగరంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్ట్ కోసం తమ వద్ద నుండి వసూలు చేసిన డబ్బులు ఇప్పించాలని ఆర్‌పిలు వేడుకున్నారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావును అధిక సంఖ్యలో ఆర్ పి లు కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. 2022 లో మార్ట్ ఏర్పాటు చేస్తున్నామని నాలుగు వేల గ్రూపుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి చెల్లించినట్లు తెలిపారు. తాము చెల్లించిన డబ్బును తిరిగి ఇప్పించాలని ఆర్ పి లు ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. ఈ విషయమై విచారించి న్యాయం జరిగేలా చూస్తానని దామచర్ల జనార్దన్‌రావు ఆర్‌పిలకు హామీ ఇచ్చారు.




## ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరిక


### పాత, కొత్త నాయకులు అందరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 12)**

కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో లింగసముద్రం మండలం తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన 20 బీసీ కుటుంబాలు గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కొత్తగా చేరిన కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సుముచిత స్థానం కల్పిస్తాం. పాత, కొత్త నాయకులు అందరూ కలసి కందుకూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వారి నాయకత్వంలో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.



పార్టీలో చేరిన కుటుంబాల వివరాలు...నాగులూరి బద్రి, చిన గంగయ్య, చిరంజీవి, రామయ్య, యేబు నల్లగట్ల కోటయ్య , ఏసు, పోలయ్య, నాగేష్, శివ, గణేష్, ప్రసాద్ నాగులూరి ధనమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, నీలం బ్రహ్మారెడ్డి, పాలిమేర చిన్న నాగిరెడ్డి, మాల్యాద్రి, ఓబుల్ రెడ్డి, ఆవుల మహేష్, పెద్దిరెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

## జెడ్పి ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పి ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ సంబంధిత పనులు ఊపందుకుంటున్నందున రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఆమె అధ్యక్షతన పాత జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ప్రకాశం జిల్లా డీఆర్ఓ బి చిన ఓబులేసు, జడ్పీ సీఈవో చిరంజీవి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధరగౌడ్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరం గీతాలాపనతో ప్రారంభమైన ఈ సమావేశంలో ప్రధానంగా పంచాయతీరాజ్, డిఆర్‌డిఏ, విద్యుత్, రోడ్లు - భవనాలు, వైద్య, వ్యవసాయ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ప్రధానంగా చర్చించారు.

**అర్హులందరికీ పెన్షన్లు :** గతంలో పెన్షన్లు పొందిన వారు ప్రస్తుతం పెన్షన్లకు దూరమయ్యారని, అర్హులైన తమకు అన్యాయం జరుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారని దర్శి, ఎర్రగొండపాలెం శాసనసభ్యులతో పాటు పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై డిఆర్డిఏ పిడి నారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్లు వస్తాయని, మెడికల్ రీ అసెస్మెంట్ జరుగుతోందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని చెప్పారు.

**రైతులెవరూ ఆందోళన చెందవద్దు :** తన నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. దీని పై జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు అవసరమైన పూర్తిస్థాయిలో ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, నిర్దిష్ట ధరలకే వారికి లభించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎరువుల వినియోగంపైనా రైతులకు నిపుణులతో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.




**కాలువలపై ప్రత్యేక దృష్టి**

తన నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించాయని, ఈ నీరు స్వేచ్ఛగా పారేలా కాలువలను శుభ్రం చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని యర్రగొండపాలెం శాసనసభ్యులు అధికారులను కోరారు. దోర్నాలలోని గండి చెరువు నుంచి నీరు లీకు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోర్నాల కమ్యూనిటీ ఆసుపత్రి, ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు లేరని, దోర్నాల ఆసుపత్రిలో నీటి సమస్య కూడా నెలకొన్నదని, (తరువాయి 4లో...)

# 218 మందికి రూ.1,18,43,916ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- 205 మందికి ఉచితంగా సైకిళ్ల పంపిణీ
- అందరికీ మెరుగైన విద్య, వైద్యం అందించడమే కూటమి లక్ష్యం
- పీ4లో మరింత మంది భాగస్వాములు కావాలి
- కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ రాష్ట్ర చరిత్రలో మైలురాయి
- రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టెంబర్ 12)

రానున్న సంక్రాంతి పండుగ నాటికి అద్దంకి నియోజకవర్గంలోని ప్రతీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు బాపట్ల జిల్లా జే. పంగలూరు మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు 205 సైకిళ్లను (తరువాయి 4లో...)

# ఆగని ఇసుక అక్రమ దందా..?

### అక్రమ ఇసుక తోలకాలకు అడ్డూ అదుపు లేకుండా దర్జాగా తరలింపు
### మండల కేంద్రాల్లో కొంత దూరంలో నిల్వ చేసి అమ్మకాలకు తెరలేపిన అక్రమ వ్యాపారులు
### కుప్పలు కొట్టి ప్రజల నెత్తిన టోపి పెట్టిన దళారులు
### పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 12)

నియోజకవర్గ పరిధిలోని ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పెట్టిన తరువాత అక్రమార్కులు బరితెగించడం మొదలు పెట్టారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. పక్క జిల్లా నుంచి లారీలతో వందల సంఖ్యలో ఇసుక రవాణా జరుతుంది. పుల్లలచెవుమండలానికి కూతవేటు దూరంలో ఉన్న గుట్లపల్లి వద్దకు ఇసుకలోడు టన్ను 800 రూ. వస్తే అక్కడనుంచి 400 రూ నుంచి దాదాపు 600 రూ. వరకు అదనంగా వసూళ్ళు చేస్తున్నారని ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. కూటమి నాయకులు చేసే కుట్రల వల్ల కష్టం చేసుకోని జీవనం సాగించే పేదలు నిలువునా బలైపోతున్నామంటు వాపోతున్నారు.ఇంత అవినీతి జరుగుతున్న సంబందీత శాఖా రెవిన్యూ పోలీస్ అధికారులు మాత్రం మాకేమీ పట్టదన్నట్టు ఉండటం గమన్నార్హం. దీంతో గ్రుహా నిర్మాణాలు చేపట్టాలంటే భయం భయం అన్నట్టుగా పరిస్తితి నెలకొంటుందని ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా నియోజకవర్గం లోని మిగతా మండలాల్లోసొంత అవసరాలకు అని చెప్పి మండలంలోని రాత్రుల్లో ఇసుక లోడు తెప్పించి ఎక్కడపడితే అక్కడ కుప్పలుకొట్టి అక్కడి నుంచి ట్రాక్టర్లుతో, తరలించి అధిక రేట్లు పెంచి పేద ప్రజల నడ్డివిరుస్తున్నారు.

ఈ వ్యవహారం తెలిసినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిదిలోని దోర్నాల పెద్దారవీడు త్రిపురాంతకం యర్రగొండపాలెం మండలాల్లో అక్రమ వ్యాపారులు దర్జాగా టన్నుల చొప్పున అధికరేట్లు ప్రజలదగ్గర వసూళ్ళు చేసి జోబులు నింపుకుంటున్నారు. ఇసుక తరలించే వారి దగ్గర ఈ-ట్రాన్సిట్ రిపోర్టు ఉండాలని, ప్రతీ వాహనానికి జీపీఎస్ ఉండాలని, అలా కాకుండా సొంత అవసరాలకని చెప్పి అక్రమంగా తరలిస్తే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని తరచూ హెచ్చరించే జిల్లా అధికారులు మండలంలో నిత్యం ఇసుక తవ్వి తరలించుకుపోతున్న వారిపై కనీస చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానా లకు తావిస్తోంది. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్ఛగా చేస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటే పరిస్థితిని ఎంతవరకో అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు కింద స్థాయి సిబ్బందిని (తరువాయి 4లో...)

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహంతోనే పరిశ్రమల అభివృద్ధి

### శిద్దా సుధీర్ కుమార్
### ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్సలెంట్ 2025 ఉత్తమ బిజినెస్ ఎక్స్పోర్ట్ అవార్డు అందుకున్న పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన బిజినెస్ ఎక్సలెన్స్‌లో ఉత్తమ బిజినెస్ ఎక్స్పోర్ట్ అవార్డును రాష్ట్ర మంత్రుల చేతుల మీదగా జ్యోతి గ్రానైట్ ఇండియా ఎక్స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ,ఇండస్ట్రీ ఫెడరేషన్ సెంట్రల్ జోన్ చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అందిన బిజినెస్ ఎక్స్పోర్ట్ 2025 అవార్డు కు తమ సంస్థ ఎన్నిక చేసిన జ్యూరి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం సుధీర్ కుమార్ మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమల అభివృద్ధి కి ప్రభుత్వం అందిస్తున్న సహకారం మర్చిపోలేమని సుధీర్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన తరం జిఎస్‌టి సంస్కరణ విధానం ప్రవేశ పెట్టిన కారణంగా ఆహారం, విద్య, వైద్య, వ్యవసాయం

4



# సమస్య విన్నాడు.... పరిష్కారానికి పూనుకున్నాడు

### యువ నాయకుడు కందుల విగ్నేష్ రెడ్డి వ్యవహారశైలి
### కృతజ్ఞతలు తెలిపిన మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లిఖార్జున


(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 12)

యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో చర్చించి లక్కిశెట్టిపాలెం వద్ద ఏళ్ళ నుంచి పరిష్కారం కాని ఆక్రమణల తొలగింపుకు పూనుకున్నాడు. ఒంగోలు - పొదిలి రోడ్డులోని లక్కిశెట్టి పాలెం వద్ద జరిగిన ఆక్రమణలతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లిఖార్జున కందుల విగ్నేష్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన విగ్నేష్‌రెడ్డి తన తండ్రి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లాడు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పొదిలి కమిషనర్ కె ఎల్ నారాయణరెడ్డికి ఆక్రమాలు తొలగించాలని ఆదేశాలిచ్చారు. దీంతో ఆ ప్రాంత వాసులు వారి స్వంత నిధులు వెచ్చించి జెసిబి, ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని కమిషనర్ పర్యవేక్షణలో ఆక్రమణలు తొలగింపుకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లికార్జున ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యువ నాయకుడు విగ్నేష్‌రెడ్డి, కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





# బాలినేనిని కలిసిన పలువురు జనసేన నాయకులు



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 12)**
హైదరాబాద్‌లో రాష్ట్ర మాజీ మంత్రి, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసులురెడ్డిని వారి నివాసంలో శుక్రవారం కొండపి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్, కందుకూరు టౌన్ జనసేన పార్టీ నాయకులు దారం పవన్ కుమార్, పొన్నలూరు మండలం జనసేన పార్టీ నాయకులు పత్తిపాటి మాధవరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. కొండపి నియోజకవర్గంలో ఉన్నటువంటి సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు జనసేన పార్టీ గురించి మనోజ్ కుమార్ వివరించడం జరిగింది. కొండపి నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుండి పార్టీ అభివృద్ధి, క్రియాశీల మెంబర్ షిప్, భవిష్యత్తులో జనసేన పార్టీ ఎదుగుదల, చేయబోయే కార్యక్రమాలు మొదలైన వాటి గురించి వివరించి దిశానిర్దేశం సలహాలు, సూచనలు బాలినేని శ్రీనివాసులురెడ్డి, మనోజ్ కుమార్‌కి అందించారు. అతి త్వరలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి గ్రామస్థాయి నుంచి పార్టీని అభివృద్ధి చేస్తానని బాలినేని శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# పబ్బిశెట్టి లక్ష్మీనారాయణకి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 12)**
పొదిలి పట్టణానికి చెందిన సీనియర్ ఎరువుల వ్యాపారి పబ్బిశెట్టి లక్ష్మీనారాయణ గత కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజవర్గ వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్ అన్నా వెంకట రాంబాబు వారి స్వగృహానికి వెళ్ళి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పొదిలి పట్టణ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వైసీపీ నాయకులు తాత సత్యనారాయణ, గాయం శ్రీనివాసరెడ్డి, రవ్వా శ్రీనివాసులు, కాటూరి అశోక్, పబ్బిశెట్టి రామ సుబ్బారావు, పబ్బిశెట్టి రామ సుధాకర్, అఖిల్, ఉత్తమ్ కుమార్, భూమా రమేష్, కొత్తూరి శ్రీను, తదితరులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

# అందరి సహకారంతోనే ఒంగోలు నగర అభివృద్ధి సాధ్యం

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)**
అందరి సహకారంతోటే ఒంగోలు నగర అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు కోరారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా పాల్గొన్న ఆయన సమావేశం అనంతరం మాట్లాడుతూ నగర సుందరీకరణలో భాగంగా ఒంగోలు నగరం నందు ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. నగరంలోని ప్రధాన రహదారులను మోడల్ రోడ్లుగా తీర్చిదిద్దనున్నట్లు తెలియజేశారు. గత ప్రభుత్వ మాదిరిగా కాకుండా ప్రజల మెచ్చే విధంగా కూటమి పాలన ఉంటుందని అన్నారు. అమృత్ పథకంలో భాగంగా ప్రజలందరికీ ప్రతి రోజు తాగునీరు ఇచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తున్న తరుణంలో కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు రాస్తున్నాయని మండిపడ్డారు. పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని ప్రత్యక్షంగా ఓ దినపత్రికను గురించి ఆయన హెచ్చరించారు.

# 218 మందికి రూ.1,18,43,916ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు













ఉచితంగా మంత్రి గొట్టిపాటి అందించారు. మేఘా కంపెనీతో పాటు నెదర్లాండ్స్ కు చెందిన మోర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో పీ4 పథకంలో భాగంగా ఈ సైకిళ్లను విద్యార్థులకు ఉచితంగా అందించామని మంత్రి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులతో పాటు అవకాశం ఉన్నవారందరూ పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు. సైకిళ్ల పంపిణీ అనంతరం పాఠశాల విద్యార్థులతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులందరికీ వచ్చే సంక్రాంతి నాటికి ఉచితంగా సైకిళ్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని మండలాల్లోని పాఠశాలల్లో సైకిళ్ల పంపిణీని పూర్తి చేశామని, మిగిలిన వారికి కూడా రాబోయే నాలుగు నెలల్లో ఉచితంగా సైకిళ్లను అందిస్తామని తెలిపారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫార్మ్ లు, పుస్తకాలు అందించామన్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులు ఎవరూ సరైన రవాణ సౌకర్యాలు లేక చదువుకు దూరం కాకూడదనే అందరికీ సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. సైకిళ్లపై పాఠశాలలకు వచ్చేప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రయాణ జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. అనంతరం అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 218 మంది లబ్ధిదారులకు రూ. 1,18,43,916 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు తొమ్మిది లక్షల రూపాయిల విలువైన (ఎల్‌ఓసీ) లెటర్ ఆఫ్ క్రెడిట్లను ఐదుగురు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ%"% ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విధానం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్కువ మంది పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యతోనే కొత్త హెల్త్ పాలసీని ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థమయినా., ప్రజా సంక్షేమం కోసమే సూపర్ 6 పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు జారీ చేశారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



ఎర్రగొండపాలెం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల నుంచి ఎర్రగొండపాలెం కేంద్రానికి అనుసంధానమైన రోడ్లలో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఇతర జడ్పిటిసిలు, ఎంపీపీలు కూడా రోడ్ల విషయంలో స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా, స్థానికంగా జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని, శాఖా పరంగా తీసుకుంటున్న చర్యలను ఆర్ అండ్ బి అధికారులు వారికి వివరించారు.







**జ్వరాలు ప్రబలకుండా చర్యలు**

తమ ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్నారని శాసనసభ్యులు, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు చెప్పారు. దీనిపై డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్వయంగా తాను పర్యటించి పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి అపాయము లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తమ ప్రాంతంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ట్రాన్స్ఫార్మర్ల కోసం డీడీలు కట్టిన రైతులు వాటి కోసం ఎదురు చూస్తున్నారని ప్రజా ప్రతినిధులు చెప్పగా, ట్రాన్స్ఫార్మర్లు త్వరగా అందేలా చూస్తామని, విద్యుత్ తీగలను సరి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలలో చేసిన తీర్మానాలను సర్వసభ్య సమావేశం ఈ సందర్భంగా ఆమోదించింది.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహంతోనే పరిశ్రమల అభివృద్ధి



రంగాల అభివృద్ధి, సగటు మనిషి జీవన ప్రమాణం మెరుగు పడటమే కాకుండా కో నుగోలు శక్తీ పెరిగి ఆర్థిక అభివృద్ధి చెందుతుందని సుధీర్ కుమార్ తెలిపారు. నూతన జిఎస్‌టి సంస్కరణ చేపట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంట్రల్ జోన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సుధీర్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే ప్రోత్సహంతో పరిశ్రమలు సంక్షోభం నుండి సంక్షేమం బాట పట్టిందని అన్నారు. తమ సంస్థకు 2025 ఉత్తమ బిజినెస్ ఎక్స్పోర్ట్ అవార్డు రావడానికి సహకారం అందించి అను నిత్యం మాకు మార్గదర్శకులుగా, సంస్థ విజయాలకు చేయూతను అందిస్తున్న మా తండ్రి, మా చైర్మన్, శిద్దా రాఘవ రావు ప్రోత్సహం మర్చిపోలేమని, అలాగే మా సంస్థ సిఓఓ ఎమ్ శివ రామ్‌కి, సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు,కార్మికులకు ప్రతి ఒక్కరి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సుధీర్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారీ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివ నాథ్, జ్యూరి సభ్యులు విశ్రాంత ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, సత్యనారాయణ, ఫుడ్ ప్రాసేసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, రీసెర్చ్ ఇన్నోవేషన్ సర్కిల్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ అజిత్ రగ్నేకర్, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ బి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆగని ఇసుక అక్రమ దందా..?

అక్కడికి పంపి చేతులు దులిపేసుకుంటున్నారని ఆరోపణలు బహిరంగానే వినబడుతున్నాయి. అంతే కాకుండా పక్కనియోజకవర్గం నుంచి వచ్చి మన నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా దోపిడీకి తెగబడి దోచుకోవడం ఎంతలరకు న్యాయం అంటూ తెలుగు తమ్ముళ్ళు గుసగుసలు. ఇంకొక పక్కేమో అటు అధికారులు ఇటు కూటమి నాయకులు దోస్తీ కట్టి వారి ఇరువురి కనుసన్నల్లో దోపిడీ జరుగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. అంటీ అంటనట్టుగా కింది స్థాయి సిబ్బంది మామ్ముళ్లు తీసుకుని వదిలేస్తున్నారని, అధికారులకు కూడా అందులో అధికారపార్టీ నాయకులకు ఇందులో వాటాలు ఉందన్న ఆరోపణలుకూడా వినిపిస్తున్నాయి.

**ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతార్ చేసి ఐ డోంట్ కేర్ అంటున్న ఇసుక మాఫియా**

సరఫరా చేసే ఇసుక డంప్‌ల వద్ద నుంచి చెక్‌పోస్టుల వరకూ మార్గమద్యాల్లో లారీ డ్రైవర్లపై కొంతమంది మధ్యవర్తులు,దందా దారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, వారు చెప్పిందే వేదంగా టన్నుకు ఇంత అన్నట్టు ఫిక్స్ చేసిన రేటు చెల్లించాలంటూ బెదిరింపులు చేస్తున్నారని విస్వసనీయ సమాచారం. ఇదంతా ప్రభుత్వ విధానాలను హరించడమేనని, అధికారులు మౌనంగా ఉండడం వల్లే ఈ ఇసుక దందా బాగోతం సాగుతోందన్నారు. ఫ్రీ ఇసుక పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధానాలను తుగలో తొక్కి ఇసుక మాఫియా డోంట్ కేర్ అంటోందని, ప్రభుత్వం ప్రకటించిన పాలసీ గ్రామాల వరకు అమలవడం లేదని విమర్శించారు. ఇసుక మార్గం సజావుగా ఉండాల్సిన చోటా, ఇష్టానుసారంగా మార్గాలను ఏర్పరచుకుంటూ దౌర్జన్యం చేస్తున్నారని విమర్శలు లేక పోలేదు.

# ప్రతి ఇంటికి మంచి నీటిని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మంచినీటి పైప్ లైన్, కుళాయిలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 12)

కందుకూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి మంచి త్రాగునీరు అందించే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు పట్టణం లోని ప్రశాంతి థియేటర్ ఎదురు బజార్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను మరియు ఇంటింటికి మంచినీటి కుళాయిలను శుక్రవారం సాయంత్రం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు అధికారులు మరియు పార్టీ నాయకులు మహిళలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఆ ప్రాంతం మహిళలు తమకు మంచినీటి పైపులైను లేదని మంచినీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.. మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయవలసిందిగా కోరారని, ప్రాంత మహిళల కోరిక మేరకు నేడు మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా మంచినీరు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత మహిళలు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మా కష్టం తెలుసుకొని మాకోసం మంచినీటి పైపు లైన్ ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలియజేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి ఆ ప్రాంత మహిళలు పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు ఆల్ భాష పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, షేక్ రఫీ, షబ్బీర్, కరిముల్లా, పద్మనాభుని సత్యం రమణయ్య, పేర్నమిట్ట శీను మస్తాన్, రసూల్, చదలవాడ కొండయ్య చిలకపాటి మధుబాబు బెజవాడ ప్రసాద్, పోకూరి రాంబాబు, కూనం నరేంద్ర, కల్లూరి శైలజ, ముచ్చు శ్రీనివాసరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, తలమంచి బ్రహ్మయ్య, చుండూరు శ్రీను, మేడ మల్లికార్జున, సవిడబోయిన వెంకటకృష్ణ షేక్ నజీర్, రూబీ, జియావుద్దీన్, ఖాదర్ బాషా, కాకుమాని ప్రవీణ్, చక్క కేశవ, ఇతర ముఖ్య నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఇరువురు వ్యక్తులు దాడి







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

నగరంలోని నెల్లూరు బస్టాండ్ దగ్గరలో కళ్యాణి బార్, రెస్టారెంట్ వద్ద మద్యం మత్తులో ఇరువురు వ్యక్తులు దాడి చేసుకున్న సంఘటన ఉదయం 9 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ ఇన్స్పెక్టర్ వై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పెల్లూరుకు చెందిన అయ్యప్ప, మరో వ్యక్తి షేక్ అనిల్ మద్యం సేవించి ఒకరి పై ఒకరు దాడి చేసుకున్నారు. అయ్యప్ప అనే వ్యక్తి పై షేక్ అనిల్ అనే వ్యక్తి (పెళ్లిళ్లకు మేళం వాయిస్తుంటాడు) బీరు సీసా పగలగొట్టి పొడవటంతో గాయాలు అయ్యాయి. మద్యం మత్తులో నలుగురుపై కూడా దాడి చేయడంతో వారు కూడా గాలైనట్లు తెలిసింది. ఒకటో పట్టణ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి గాయపడిన వ్యక్తులను ఒంగోలు రిమ్స్ కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అనధికార లేఅవుట్లు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ నిబంధనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

అనధికార లేఅవుట్లు , ప్లాట్ల రెగ్యులరైజేషన్ నిబంధనలు జీవోఎంఎస్ 10, 8.1.2020కి సవరణలు చేస్తూ ప్రభుత్వం జీవోఎంఎస్ 134, 26.7.2025 జారీ చేసింది. ఈ ఉత్తర్వులలో ముఖ్యంగా ప్లాటు లేఅవుట్ తుది గడువును 31.08.2019 నుండి 30.06.2025 వరకు పొడిగించింది. అనధికార లేఅవుట్‌లలోని కనీసం ఒక ప్లాట్, కటాఫ్ తేదికి ముందు అంటే 30.06.2025 కి ముందే రిజిస్టర్ అయి ఉండాలన్నారు. జీవోఎంఎస్ 134, అమలు 26.7.2025 నుండి 90 రోజుల లోపు ప్లాటు లేఅవుట్ రెగ్యులరైజేషన్‌కు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థకు నూతనంగా అనధికార లేఅవుట్ ప్లాట్లు రెగ్యులరైజేషన్‌కు 27 అప్లికేషన్లు వచ్చి ఉన్నాయన్నారు. 12.09.2025న ఒంగోలు నగరపాలక సంస్థ వారు వచ్చిన దరఖాస్తుల మేరకు క్షేత్ర స్థాయిలో విచారించి 10 దరఖాస్తులను వెంటనే రెగ్యులరైజేషన్ చేసి ఆమోదించి ఉన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలు వాడుకోవాలన్నారు. మీరు 45 రోజులో పూర్తి మొత్తాన్ని చెల్లిస్తే మీకు 10% తగ్గింపు లభిస్తుందన్నారు. 45-90 రోజులో పూర్తి మొత్తాన్ని చెల్లిస్తే మీకు 5% తగ్గింపు లభిస్తుంది. ఓపెన్ స్పేస్ ఉన్నపుడు భూమి విలువ పై 7% అదనపు చార్జీలు ఉంటాయి (14% ఓపెన్ స్పేస్ చార్జీల పై 50% రాయితీ ఇవ్వబడినది). కావున ఎన్నో ప్రయోజనాలు అనగా ఆస్తి విలువ పెరుగుతుంది. భద్రత లభిస్తుంది. బ్యాంకులు రుణసౌకర్యాన్ని కల్పిస్తాయి. క్రయ, విక్రయాలు చేసుకునేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయి. సునాయాసంగా అనుమతులు లభిస్తాయి. ఆ విధంగా సకాలంలో రెగ్యులరైజేషన్ చేసుకొనకపోతే జరిగే నష్టాలు ప్లాటు చట్టబద్దం కానందున భవన అనుమతి ఇవ్వబడదు. క్రయ, విక్రయ మార్పిడి చేసుకోవడం వంటి సమస్యాత్మాకంగా మారుతాయి. ఆస్తి విలువ తగ్గుతుంది. భవిష్యత్తులో ప్రభుత్వ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు ఉన్న ప్లాటు యజమానులు, డెవలపర్స్ ప్రభుత్వం వారు అందించిన గడువు 23.10.2025 లోపల రెగ్యులరైజేషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. లేఅవుట్లను సిబ్బందితో నగరపాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు పరిశీలించారు.

# భూసారాన్ని పెంచుకోవాలి ఏడిఏ బాలాజీ నాయక్





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 12)

మండలంలోని గానుగ పెంట గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సౌజన్యంతో మండల వ్యవసాయ అధికారి పి జోష్ణ దేవి రైతులకు భూసారాన్ని పెంచుకోవడంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు మార్కాపురం డి బాలాజీ నాయక్ గారు రైతుల ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం రైతులు వేస్తున్న రసాయనిక ఎరువుల వలన భూమి తన సహజ స్థితిని కోల్పోతుందని, భూమిలో ఉన్న సూక్ష్మజీవులన్నీ నశించిపోతున్నట్లుగా వివరించారు. కెమికల్ ఎరువులు అధికంగా వాడటం వలన మానవ ఆరోగ్యం పై ప్రభావం చూపుతున్నట్లుగా, వాతావరణం కాలుష్యం ఎక్కువ అవుతుందని తెలియజేశారు. ప్రాచీన పద్ధతులను సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించి, పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టి పూత దశలో భూమిలో కలియదుని నట్లయితే రసాయనక ఎరువులను భూమిలో వేయటం తగ్గించుకోవచ్చని తెలియజేశారు. పప్పు జాతి పైర్లు పెసర, మినుము మొదలగు పంటలు సాగు చేయడం వలన వాతావరణంలోని సహజ సిద్ధంగా లభించే నత్రజని వేరు బుడిపేలు ద్వారా మొక్కకు అందజేస్తాయని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వారు అందించే నవధాన్యాలు సాగు చేపట్టి వాటిని భూమిలో కలయిదునుకొని భూసారాన్ని పెంచుకోవాలని తెలిపారు. వానపాముల ఎరువు వాడటం ద్వారా భూమి గుల్లబారి సూక్ష్మజీవులు పెరగడానికి దోహదపడుతుందని తెలియజేశారు. చివికిన పశువుల ఎరువును ట్రైకోడెర్మా విరిడితో కలిపి నీడన ఆరబెట్టుకొని 15 రోజుల తర్వాత పండ్లమొక్కలకు, పొలాల్లో చలినట్లయితే జీవ శిలీంద్రాలు వేరు భాగంలో విస్తరించి నేల ద్వారా, వేళ్ళ ద్వారా సంక్రమించే తెగుళ్లను వ్యాప్తి కాకుండా అరికట్టవచ్చని తెలియజేశారు. భూసార పరీక్ష ఫలితాల అనుగుణంగా ఎరువులను వాడాలని తెలిపారు విచక్షణారహితంగా రసాయన ఎరువులను వాడరాదని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రమణి, ఏఈఓ దేవేంద్ర గౌడ్, విహెచ్ఎ సాయిరాం, సిబ్బంది రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

# కొత్తపట్నం బీజేపీ మండల అధ్యక్షుడి పై దాడి

## ఎస్పీకి ఫిర్యాదు చేసిన జిల్లా బీజేపీ నాయకులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)



కొత్తపట్నం గ్రామంలో శుక్రవారం ఉదయం ఘోర సంఘటన చోటుచేసుకుంది. కొత్తపట్నం బీజేపీ మండల అధ్యక్షుడు యలమందుపై అదే గ్రామానికి చెందిన రవి, కిరణ్, రాఖి అనే ముగ్గురు వ్యక్తులు అతి దారుణంగా దాడి చేశారు. స్థానిక సమాచారం ప్రకారం, వ్యక్తిగత విభేదాలు, రాజకీయ కోపంతో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. యలమందుకు గాయాలు కావడంతో ఆయనను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా బీజేపీ నాయకులు వెంటనే స్పందించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు సేగ్గం శ్రీనివాసులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆశారావు, మాకినేని అమరసింహం, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, జిల్లా నాయకులు కొక్కూరి సతీష్తో పాటు పలువురు కీలక నేతలు కలసి జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దాడి ఘటన పై ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానంలో రాజకీయ విభేదాలు సహజం కానీ అతి దారుణమైన శారీరక దాడులు ఖండనీయమని, ఈ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలను విచారించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసు వ్యవస్థ జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ని కోరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు సేగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ, “మా పార్టీ నాయకులపై జరుగుతున్న ఈ తరహా దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా శాంతియుతంగా వ్యవహరించాలి కానీ ఇలాంటి దాడులు సహించబోము” అని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఫిర్యాదు స్వీకరించి, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనతో కొత్తపట్నం ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేసిన వారికి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు.




# జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోష్ యాక్ట్ పై అవగాహన సదస్సు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 12)

మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై సుధాకర బాబు అధ్యక్షతనలో శుక్రవారం పోష్ యాక్ట్ -2013 పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు పోలీస్ స్టేషన్ నుంచి డి. ఆదిశేషయ్య, హెడ్ కానిస్టేబుల్ పాల్గొని పోష్ యాక్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, చట్టంలోని నిబంధనలు ,క్రిమినల్ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు, పాల్గొని విద్యార్థులకు చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో విద్యార్థుల విజయం

యూత్ ఫెస్ట్ 2025-26 సందర్భంలో జరిగిన "రెడ్ రన్" మారథాన్లో మొదటి బహుమతి విజయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

జిల్లా సమగ్ర వ్యూహం కోసం హెచ్ఐవి, ఎయిడ్స్ (డిషా) ఆధ్వర్యంలో 12-09-2025న నిర్వహించబడిన 5 కిలోమీటర్ల "రెడ్ రన్ మారథాన్" పోటీలో శ్రీ హర్షిణి ఇంజినీరింగ్, టెక్నాలజీ మహిళా కళాశాల విద్యార్థినులు అద్భుతమైన ప్రతిభ చూపించారు. ఈ పోటీలో కుమారి ఈవి నాగ ఇశ్వర్య అత్యుత్తమంగా ప్రదర్శన ఇవ్వడం ద్వారా మొదటి స్థానం సాధించి, రూ.10,000 నగదు బహుమతిని పొందారు. అలాగే కుమారి జి లస్య ప్రియ ఐదవ స్థానం సంపాదించగా, ఇద్దరికీ మెరిట్ సర్టిఫికేట్లు అందించబడ్డాయి. ఈ విజయం సందర్భంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. అందులో అధ్యక్షులు జి.రవి కుమార్ , డైరెక్టర్ జి.హారీషిత్ , వైస్ ప్రిన్సిపల్ కె సుదీర్ చక్రవర్తి , పి.శ్రీదేవి, ఇతర అధ్యాపకులు సీత, అనురాధ, ఉమాదేవి, మనికంఠ, పవన్ ,అధికారేతర సిబ్బంది అందరూ విద్యార్థినులను అభినందించారు. కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం పట్ల సిబ్బంది, విద్యార్థులు గర్వంగా అభినందనల వర్షం కురిపించారు. ఈ విజయంతో కళాశాల ప్రతిష్ట మరింత పెరిగినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది.

# మొబైల్ ఫోన్స్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఒంగోలు రైల్వే సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ మౌలా షరీఫ్ ఆధ్వర్యంలో ఒంగోలు ఎస్ఐ కె మధుసూదన్‌రావు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిఐ కొండలరావు, వారి సిబ్బంది సహకారంతో రైళ్లలో ప్రయాణిస్తు నిద్రిస్తున్న ప్రయాణికుల మొబైల్ ఫోన్స్ ను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఆసాది చంగల్ రావు సన్ఆఫ్ సిద్దయ్య 45 సంవత్సరాలు, వేటపాలెం అను దొంగను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 12 స్మార్ట్ మొబైల్ ఫోన్స్ సుమారు రూ.1,49,000 విలువగల మొబైల్స్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

# రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరు సమీపంలో రైల్వే ట్రాక్ పై అదే గ్రామానికి చెందిన వడ్డారుపు సూరయ్య 55 సంవత్సరాల అనే వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం చిల్లచే దురుగా పడి ఉంది. రైల్వే పోలీసులకు అందిన సమాచారం మేరకు సూరయ్య అనే వ్యక్తి ఒంగోలు నగరంలోని బండ్లమెట్ట ప్రాంతంలో ప్లే వుడ్ దుకాణం నిర్వహిస్తున్నారని, ప్రతిరోజు వాకింగ్ కి వెళ్లి వస్తుంటారని వాకింగ్ వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం ఉదయం వెతకగా రైల్వే ట్రాక్పై మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు సూరయ్యదుగా గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, మృతదేహాన్ని ఒంగోలు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

(షణ్ముఖ వెలుగు, దోర్నాల, సెప్టెంబర్ 12)

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని దోర్నాల మండలం రామచంద్ర కోట గ్రామంలో జరిగిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఫిలిప్, స్వాతిల వివాహానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆయన ఆశీర్వదించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్‌పి యాదవ్, దోర్నాల తెలుగుదేశం పార్టీ నాయకులు మహబూబ్, సుధాకర్‌రెడ్డిలతో పాటు పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వ్యక్తులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అటు పిమ్మట జరిగిన ప్రైవేటు మీటింగ్ లో ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ త్వరలో కాటంరాజు దేవాలయం వద్ద గతంలో నేను మాట ఇచ్చిన విధంగా సుమారు రూ.18 లక్షల అంచనా వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంక్ విత్ పవర్ బోర్‌ను ఏర్పాటు చేయడానికి ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచనలు ఇచ్చి వీలైనంత త్వరగా అక్కడ పనులు మొదలు పెట్టాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలియజేశారు. కాటమరాజు తిరునాళ్ల సందర్భంగా వస్తున్నటువంటి సుమారు ఒకటిన్నర లక్షల మంది భక్తులకు తిరుణాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు సక్రమంగా 2025 తిర్నాల్లో చేశామని, రానున్న రోజుల్లో వీలున్నన్ని ఎక్కువ ఎలక్ట్రికల్ ప్రభలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నియోజకవర్గంలోని యాదవ సోదరులకు, మిగతా భక్తులకు ఉందని ఆయన తెలియజేశారు. ఈ సంవత్సరం జరిగిన తిరునాలలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మూడు ఎలక్ట్రికల్ ప్రభలను ఏర్పాటు చేయడానికి అనుమతిని సాధించడానికి ఎన్నో అవంతరాలు ఎదుర్కొన్నామని సంబంధిత అధికారులకు నచ్చజెప్పి అనుమతులు సాధించామని ఆయన తెలియజేశారు. మొన్నటి తిరుణాలలో ఎదుర్కొన్నటువంటి అనుభవాల దృష్ట్యా వాటన్నిటినీ అధిగమించి రానున్న తిరణాలలో ఎలాంటి ఇబ్బంది రాకుండా భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని స్వామివారి దర్శనానికి కూడా విధివిధానాలను అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అన్నిటికంటే ప్రధానమైనటువంటిది



నల్లమల అడవిలో ఉన్నటువంటి శ్రీ కాటమరాజు ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచినటువంటిదని, ఆలయం దగ్గర అన్ని వసతులతో భక్తులకు సౌకర్యాలు కలగజేయకపోతే అనేకమైనటువంటి ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని ఉచిత భోజన వసతిని దేవస్థానం కమిటీ చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఇంకా ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుందామని కూడా వారు తెలియజేశారు. నీటి వసతికి అవసరమైన మేరకు ఒంగోలు పార్లమెంటు సభ్యులతో మాట్లాడి ఆరు లక్షల రూపాయలతో శుద్ధ జల కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయిస్తానని అందుకు ఎంపీతో మాట్లాడగా వారి నుండి హామీ లభించిందని కూడా ఇన్చార్జి తెలియజేశారు. గతంలో కమిటీ అధ్యక్షులు గుమ్మా గంగరాజు యాదవ్ ఆలయ ముఖ్య బాధ్యులు పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ మరియు కమిటీ సభ్యులందరూ కలిసి వచ్చి ఆలయ అభివృద్ధికి సుమారు పది లక్షల రూపాయలతో 2025 తిర్నాల నాటికి ఎలక్ట్రిక్ స్తంభాలను ఏర్పాటు చేసి లైటింగ్ ఏర్పాటు చేసినటువంటి సందర్భంలో యాదవ సామాజిక వర్గం తరఫున కాకుండా భక్తులందరి తరఫున మనకు ధన్యవాదాలు తెలియజేస్తూ వారు కోరిన విధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సెల్ఫోన్ సిగ్నల్స్ రాని కారణంగా పూర్తిగా నల్లమల అడవి ప్రాంతం అయినందున టైగర్ జోన్ కూడా ఉన్నందున బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాల్సినటువంటి పరిస్థితులు ఆకలింపు చేసుకొని తాను ఒంగోలు ఎంపీకి మాట్లాడి లేకను కూడా అందించాలని వారు కూడా గుమ్మా గంగరాజు యాదవ ద్వారా వెంకటనారాయణ యాదవ్ , ద్వారా కేంద్రమంత్రి టెలికం శాఖ వారు పెమ్మసాని చంద్రశేఖర్‌కి సిఫారసులు లేఖను కూడా ఇచ్చి పంపించినారని తెలియజేశారు. ఆ నేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్ మరికొందరు కేంద్ర మంత్రివర్యులు కలిసి శ్రీ కాటంరాజు గంగాభవాని దేవాలయం యొక్క ప్రభావాన్ని తెలియపరచి వారిని ఒకసారి తిరుణాలకు రమ్మని ఆహ్వానించడంతోపాటు ఆలయం వద్ద సెల్ఫోన్ సిగ్నల్స్ లేని విషయాన్ని చర్చించారు. వచ్చే విడత లో తాను కాటమరాజు ఆలయానికి సెల్ఫోన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయటానికి ఉన్నటువంటి సాధ్యసాధ్యాలను పరిశీలించమని అధికారులను ఆదేశిస్తారని తప్పకుండా మీకు సిగ్నల్స్ వచ్చే విధంగా ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి కోరిన ప్రకారంగా యాదవుల మనోభావాలను గౌరవించి ఆ ప్రాంత భక్తుల యొక్క సౌకర్యం కచ్చితంగా సిగ్నల్స్ వచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సుమారు 200 మంది వివిధ పార్టీల నాయకులు అందరి సమక్షంలో ఎరిక్షన్ బాబు మాట్లాడిన మాటలకు ముగ్ధులైనటువంటి వారందరూ హర్షధ్వానాలతో అభినందనలు తెలియజేశారు. ఎరిక్షన్ బాబుతో మాట్లాడిన వారిలో మార్కాపురం డివిజన్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలవకూరి అబ్రహం, రాజ్ కుమార్, నాగం రామకృష్ణ యాదవ్, దోర్నాల మహబూబ్, సుధాకర్‌రెడ్డి, లాయర్ కాశయ్య ఉన్నారు.

# మండలంలో నరేంద్ర మోడీ విజయోత్సవం

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పాలాభిషేకం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 12)



పొదిలి మండలంలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ విజయాలను పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేసి విజయోత్సవం నిర్వహించారు. దేశ పరిపాలనలో నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, తాజాగా జీఎస్టీ తగ్గింపు వంటి కీలక చర్యలు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయని మండల బీజేపీ నాయకులు పేర్కొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ "నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై అగ్రస్థానంలో నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్టను పెంచడమే కాకుండా, దేశీయంగా కూడా సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తున్నారు. ముఖ్యంగా పేదల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు మద్దతు ధరల పెంపు, మహిళల సాధికారత కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నారు" అని అన్నారు. మండల అధ్యక్షుడు దోర్నాల రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు యుద్ధం మహేష్, మైనార్టీ మోర్చా యూత్ లీడర్ ఎస్కే రఫీ మాట్లాడుతూ "జీఎస్టీ తగ్గింపు వల్ల చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు ఊరట లభించింది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు దేశ ప్రజల జీవన ప్రమాణాలను మార్చేశాయి" అని అభిప్రాయపడ్డారు. వీరిశెట్టి కాలేజీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా పాల్గొని నరేంద్ర మోడీ గారి విజయాలను అభినందించారు. అనంతరం మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, విజయోత్సాహ నినాదాలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణ చేయాలి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 12)

ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణ చేయాలని దశలవారీగా పోరాడని సిద్ధమన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేయటానికి జీవో ఎంఎస్ నెంబర్ 114ను 21.102023 విడుదల చేశారు. అన్ని శాఖలలో క్రమబద్ధీకరణ జరిగి ఎన్నికల కోడ్ కారణంగా కేవలం ఒక విద్యుత్ శాఖ లోనే క్రమబద్ధీ కరణ నిలిచిపోయింది. దానిలో భాగంగా నేడు ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలతో ఎంపీ భవన్ విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం. అప్పటికి ఏ నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రంలోని మహిళా కాంట్రాక్టు లెక్చరర్స్ తో 36 గంటలు మహిళలు దీక్ష చేయాలని ప్రభుత్వ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యేసు పోగు జాన్‌బాబు, బివి కాశి రత్నం షేక్ ఖాదరవల్లి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# ఒంగోలు నగర పాలక సంస్థలు తొలగించిన మేస్త్రిలను, చనిపోయిన కుటుంబ సభ్యుల్ని పనిలోకి తీసుకుంటాం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద స్థానిక సమస్యల పై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నగర కన్వీనర్ టి మహేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో మునిసిపల్ కార్మికుల సమస్యలపై అనేకసార్లు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. కోవిడ్ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, చనిపోయిన, ఆరోగ్యం బాగా లేని వాళ్ళ కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని, పని ప్రదేశాల్లో కార్మికుల పై రాజకీయ బెదిరింపుల ఆపాలని, సేఫ్టీ మీటర్లు ఇవ్వాలని, కార్మికుల పై పని భారం తగ్గించాలని కార్మికుల సంఖ్యను పెంచాలని, అనేక సార్లు ప్రభుత్వానికి, మున్సిపల్ అధికారులకు విన్నవించామన్నారు. పరిష్కారం కాకపోవడంతో గత్యంతరం లేని కారణంగా ఎమ్మెల్యేని కలవడం జరిగిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే చెప్పిన హామీలు నిలబెట్టుకొని మేస్త్రిని విధుల్లోకి తీసుకోవాలని, చనిపోయిన కుటుంబ సభ్యులను కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఒంగోలు నగర పాలక సంస్థలో తొలగించిన మేస్త్రిలను, చనిపోయిన కుటుంబ సభ్యుల్ని పనిలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే కార్మికులు దశల వారి పోరాటానికి సిద్ధమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు. జి నరసింహం, టీ విజయమ్మ, రాష్ట్ర నాయకురాలు, కే సామ్రాజ్యం, ఆర్ శ్రీనివాసరావు, ఎం బాబు, వై రవి, బి జేమ్స్, లక్ష్మీకాంతం, పి కోటేశ్వరి, భారతి, కే యాకోబు, ఆర్ రాములు, కే మోహన్‌రావు, రవణమ్మ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధన అనేది శాస్త్రీయ విధానంలో నిర్వహిస్తేనే సత్ఫలితాలు

## ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డివిఆర్‌మూర్తి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

పరిశోధకులు తమ పరిశోధనలను శాస్త్రీయ విధానంలో నిర్వహించినపుడు మాత్రమే అత్యుత్తమ ఫలితాలను పొందవచ్చునని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క పరిశోధకుడు తప్పకుండా దృష్టిలో ఉంచుకొని పరిశోధన విషయంలో ముందుకు సాగాలని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీ లోగల సమావేశపు హాలులో శుక్రవారం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో " పరిశోధనా విధానంలో ప్రాథమిక అంశాలు - పరిశోధకుల పాత్ర " అనే అంశము మీద ఒక రోజు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏ.కే.యూ. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. నిర్మలామణి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏ.కే.యూ ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తి తన సుధీర్ఘ ప్రసంగంలో ' శాస్త్రీయ పరిశోధనలో సిద్ధాంతాలు - సామాజిక శాస్త్ర పరిశోధన, పరిశోధనలో సైన్స్ యొక్క ప్రాథమిక అంచనాలు, పరిశోధనలో సానుకూలత, పరిశోధనలో సామాజిక దృగ్విషయాలు,పరిశోధనలో కారణాల విశ్లేషణ' తదితర అంశాలపై ఉదాహరణలతో కూడిన విశ్లేషణాత్మకమైన సందేశాన్ని ఇచ్చారు.పరిశోధన అంటేనే ఏదో ఒక నూతన విషయాన్ని అన్వేషించడమని, ఇందులో భాగంగా పరిశోధలో శాస్త్రీయ పద్ధతిని 16,17వ శతాబ్దాల కాలంలోనే ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా పరిశోధనా విధానం అనేది శాస్త్రీయ దృక్పధంతోనే కొనసాగించాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా నేటి పరిశోధకులు సమాచార సేకరణకు ఉపక్రమించ వలసిన ఆవశ్యకతపై ప్రొఫెసర్ మూర్తి పరిశోధకులకు పలు మెళకువలను, సూచనలను అందించారు. ఏ. కే. యూ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ రీసెర్చ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ నిర్మలా మణి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నందు ప్రవేశం పొందిన 52 మంది పరిశోదక విద్యార్థుల కోసం 34 మంది గైడ్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పరిశోధనా కాలంలో పరిశోధకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశోధనా అంశాలను అన్వయక్రమంలో పొందుపరిచే విధానం, డేటా సేకరణ సమయంలో పాటించ వలసిన నిబంధనలు, పరిశోధనా పర్యవేక్షకులతో వ్యవహరించవలసిన తీరుతెన్ను లతోబాటు రీసెర్చ్ మేథడాలజీ బోధనా విషయంలో పలు ముఖ్యమైన అంశాల గురించి ఓ.ఎస్డి, చరిత్ర విభాగం పరిశోధక పర్యవేక్షకులు ప్రొఫెసర్ గుత్తి. రాజమెహన్ రావు, ఎడ్యుకేషన్ విభాగం హెడ్ డాక్టర్ ఏ. అమృతవల్లీ దేవి తదితరులు తమ ప్రసంగాలలో పరిశోధకులకు చక్కగా వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సి.ఈ. ప్రొఫెసర్ గోదేశి. సోమ శేఖర, ఏ.సి.ఈ డాక్టర్ అంచుల. భారతీ దేవి, ఏ.కే.యూ సిడిసి విభాగం మాజీ డీన్, చరిత్ర విభాగం పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ దొడ్డా. వెంకటేశ్వర రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే.హర్ష ప్రీతం దేవ్ కుమార్, పలు విభాగాల సహాయక ఆచార్యులు, ఆర్ అండ్ డి విభాగం సిబ్బంది, ఏ.కే.యూ బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, ఏ.కే.యూ కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.





# దుకాణాలు కోల్పోతున్న వారికి పాత మార్కెట్ స్థలంలో దుకాణాలతో పాటు, టిడిఆర్ బాండ్లు




### ఎమ్మెల్యే దామచర్ల హామీ
### వాడి వేడిగా ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ అత్యవసర కౌన్సిల్ సమావేశం
### సమావేశానికి మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు డుమ్మా
### ట్రంకు రోడ్డు విస్తరణ పనులు
### స్థలం కోల్పోతున్న వ్యాపారులకు న్యాయం చేసిన తర్వాతే ప్రారంభించాలి
### వైసిపి కార్పొరేటర్ల డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఒంగోలు నగర పాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశం డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. నగర పాలక సంస్థ కార్యాలయం నందు జరిగిన సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, బి ఎన్ విజయ్ కుమార్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. మొత్తం 50 మంది సభ్యులు ఉండగా 25 మంది మాత్రమే హాజరయ్యారు. వైసిపి పార్టీ నుంచి జనసేన పార్టీలో చేరిన కార్పొరేటర్లు ఒకరు ఇద్దరు తప్ప మిగిలిన సభ్యులు అందరూ గైర్హాజరయ్యారు. కోరం సంబంధించిన సభ్యులు సమావేశంలో ఉండడంతో సమావేశాన్ని కొనసాగించారు. మొత్తం 64 అంశాలు అజెండా నందు ప్రవేశ పెట్టగా ఒకటి రెండు అంశాలు తప్ప మిగిలినవి అంశాలు అన్నిటికి కౌన్సిల్ ఏకముక్తంతో ఆమోదం తెలిపింది. ఒంగోలు నగరం అభివృద్ధిలో భాగంగా కౌన్సిల్ సమావేశం నందు అజెండాలో పొందుపరిచిన అంశం 6,7 పై సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. అంశం 6 కు సంబంధించి న ట్రంక్ రోడ్ విస్తరణకు సంబంధించి అంశం చర్చకు రాగా టీడీపీ,వైసిపి సభ్యులు మధ్య వాదనలు జరిగాయి. దుకాణాలు కోల్పోతున్న వ్యాపారులకు న్యాయం చేసిన తరువాతే విస్తరణ పనులు చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు స్పందిస్తూ వ్యాపారస్తులు సంతోషంగా ఉండాలనే సంకల్పంతో అనేక మార్లు వారితో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. పూర్తిగా దుకాణాలు కోల్పోతున్న వారికి పాత మార్కెట్ స్థలంలో దుకాణాలు నిర్మించి ఇవ్వడంతో పాటు టిడిఆర్ బాండ్లు ఇస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. 100 అడుగులు విస్తీర్ణం చేస్తే 193 దుకాణాలు, 80 అడుగులు విస్తీర్ణం చేస్తే 77 దుకాణాలు పూర్తిగా పోతున్నాయని వారి అందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు. ఈ విషయాన్ని కొంత మంది దుకాణాల యజమానులు కోర్టుకు వెళ్ళడంతో కోర్టు నిర్ణయం కోసం వేచి వేచి చూస్తున్నామని త్వరలోనే మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల విస్తరణ పనులను చేపడతామని దామచర్ల తెలియజేశారు. అజెండాలో అంశం 7లో భాగంగా మస్తాన్ దర్గా కూడలి నుంచి కొత్తపట్నం బస్టాండ్ రోడ్డు వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులలో భాగంగా అక్కడి దుకాణాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసిన తర్వాత వారి నుండి నిర్ణయం తీసుకొని పనులు చేపడతామని ఎమ్మెల్యే దామచర్ల కౌన్సిల్ సమావేశ వేదికగా పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వ పాలన ఉండదని స్పష్టం చేశారు. పోలీసుల మీద సైతం దాడులు చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. సాంప్రదాయంగా జరుపుకునే పండుగ అడ్డుపెట్టుకొని పోలీసుల మీద దాడి చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే వినాయక చవితికి ఒంగోలు నగరంలో ఎటువంటి డీజేలు ఉండవని దీని పై కఠినంగా వ్యవహరిస్తామని దామచర్ల తేల్చి చెప్పారు.





# 16న వినుకొండలో డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహావిష్కరణ

### పల్నాడుకు కోడెల సేవల్ని స్మరించుకునే అరుదైన సందర్భం
### భారీగా తరలి రావాలని చీఫ్ విప్ కార్యాలయం పిలుపు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, సెప్టంబర్ 12)

పల్నాడు ప్రాంతానికే ప్రత్యేక గుర్తింపు తీసుకుని వచ్చిన మాజీ సభాపతి, మాజీమంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహ ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. ఎమ్మెల్యేగా, వివిధ శాఖల మంత్రిగా, నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా సెప్టెంబర్ 16 కోడెల శివప్రసాద్ వర్ధంతి సందర్భంగా వినుకొండలోని ఎన్‌ఎస్‌పీ మైదానంలో ఆ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కార్యాలయ వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఆ మేరకు ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుందని వెల్లడించారు. పల్నాడు ప్రాంతానికే కాక ఉమ్మడి గుంటూరు జిల్లా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే తనదైన ముద్ర వేసిన అరుదైన వ్యక్తి కోడెల అని, ఆయన స్థానిక ప్రజలకు చేసిన సేవలు, అభివృద్ధికి సూచికగా విగ్రహ ఆవిష్కరణకు అంతా భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. రాజకీయ, సామాజిక, వైద్య రంగాలలో కోడెల సేవలు, పల్నాడు జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి పోతుందని ఆ స్మృతులకు గౌరవంగానే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో సభాపతి అయ్యన్నతో పాటు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అహ్మద్ షరీఫ్, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరామ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఉచిత వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో డాక్టర్ ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ , వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ఆర్ఫాన్స్ వారి ఆధ్వర్యంలో, ఉపాస్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఒంగోలు వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభమైన వైద్య శిబిరం నందు సుమారు 100 మందికి షుగరు, బి పి, ఈ సి జి , పి ఎఫ్ టి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేసారు. వైద్య శిబిరం నందు ఉపాస్ హాస్పిటల్ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డయాబెటాలజిస్ట్ , సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు, వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన వారిని పరిశీలించి అవసరమైన మందులు అందచేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి 15 రోజుల పాటు ఉచిత ఓపి, నిర్ణీత వైద్య పరీక్షలపై 50% రాయితీ ఇస్తున్నట్లు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్ డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియచేశారు. గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరం అవుతుందన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ చివుకుల, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ తెలిపారు. ముఖ్యంగా సాధారణ, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్ నందు ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్టు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మర్లపాడు గ్రామ పెద్దలు, దర్శిగుంట సునీల్, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్, పి ఆర్ ఓ మల్లికార్జున, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులను జైల్లో కలిసిన ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఒంగోలు జైలులో అక్రమంగా అరెస్ట్ అయి ఉన్న ఒంగోలు 45వ డివిజన్ కార్యకర్తలను దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఎర్రగొండ పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు ఇంచార్జి చుండూరు రవిలు ములాఖాత్ ద్వారా జైలులో పరామర్శించారు. జైలు బయట ఉన్న బంధువులను ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె వి రమణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నగిరికంటి శ్రీనివాసరావు, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావుతో కలిసి పరామర్శించారు.

# భూములు కోల్పోయిన ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

### భూములు కోల్పోయిన కుటుంబాల్లో ఉద్యోగానికి మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 12)

పారిశ్రామిక అభివృద్ధి కోసం భూములు కోల్పోయిన ప్రతి ఒక్క రైతు కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చారు. గుడ్లూరు మండలం రావూరు గ్రామంలో రైతులతో శుక్రవారం ఉదయం సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం త్వరలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని దానికోసం భూములు కోల్పోతున్న ప్రతి ఒక్క రైతుకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో రైతులకు ఏవైనా భూ సమస్యలు ఉంటే అర్జీలు ద్వారా సమర్పించినచో అధికారులు వాటి సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తారని తెలిపారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ప్రతి ఒక్కరికి ఉద్యోగం కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల ఎమ్మార్వో విజయభాస్కర్, రెవిన్యూ సిబ్బంది, రావూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బార్, రెస్టారెంట్ యజమానులతో సమావేశం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 12)

మార్కాపురం పట్టణంలో జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారి షేక్ అయేషా బేగం, ఒంగోలు మార్కాపురంలో ఏ4 లైసెన్సీలు, బార్ , రెస్టారెంట్ యజమానులు, ఆసక్తి గల వ్యక్తులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కాపురం మున్సిపాలిటీలో కేటాయించిన రెండు బార్‌లకు సంబంధించి దరఖాస్తులు సమర్పించడానికి వారిని ప్రోత్సహిస్తూ, నూతన బార్ పాలసీ 2025-28 లోని ముఖ్య అంశాలను వివరించారు. అలాగే, మిగిలిన ఖాళీ బార్ల కోసం గరిష్ట సంఖ్యలో దరఖాస్తులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## ఆర్ఓ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి ఘన స్వాగతం పలికిన యర్రారెడ్డిపాలెం పంచాయితీ ప్రజలు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 12)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం, అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పేర్కొన్నారు. లింగసముద్రం మండలం యర్రారెడ్డిపాలెం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను గురువారం రాత్రి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊరి బాగుకోసం తన సొంత నిధులతో మంచినీటి , ప్లాంట్ ను ఏర్పాటు చేసిన దాత ఉప్పుటూరి కృష్ణను ఎమ్మెల్యే ముందుగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి తన సొంత ప్రయోజనాలకు ముఖ్యమంత్రి పదవి వాడుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు... కానీ తమ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారధ్యంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర యువ నాయకులు, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రకాశం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని చెప్పిన మాట ప్రకారం రామాయపట్నం, బిపిసిఎల్, ఇండోసోల్ భారీ పరిశ్రమల తో పాటు వాటి అనుబంధం పరిశ్రమలను మన నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నారని వాటి ద్వారా మన నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.. రాష్ట్రంలో నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగాలను కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తూ రాష్ట్రానికి భారీ పరిశ్రమలు పెట్టుబడులను తీసుకొచ్చేందుకు నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు తనను నమ్మి మంచి మెజార్టీతో దీవించారని, వారి ఆశలు, అభిప్రాయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చొరవతో సోమశిల ఉత్తర కాల ద్వారా రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల నుంచి రావలసిన 1.5 టిఎంసి నీరు త్వరలో ప్రాజెక్టు చేరుతాయని రైతులకు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం చీకటి జీవోలతో ప్రజలకు తెలియకుండా పరిపాలన సాగించిందని దానిలో భాగంగానే గత ప్రభుత్వంలో 3 వేల ఎకరాలను జిందాల్ కంపెనీకి అప్పజెప్పినట్లు తెలిపారు. యర్రారెడ్డిపాలెం ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా చూసుకునేందుకు తానున్నానని ప్రజలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి గ్రామస్తులు, మహిళలు పార్టీ నాయకులు, కార్యకర్తలు రథంపై ఊరేగిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, పార్టీ నాయకులు ప్రసాద్ నారిబోయిన నారాయణ, మధు, కిలారి కొండయ్య, అడపా రంగయ్య, బోయిళ్ళ కొండప నాయుడు, అడపా నరసయ్య, నీలం బ్రహ్మారెడ్డి, జంపాల శివ, గొర్రెపాటి సాంబయ్య, కిలారి వెంకటేశ్వర్లు మద్దెల రామారావు, ముత్తులూరి సుధాకర్, బండ్లమూడి రామయ్య , మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.








# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

## మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ యాగంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 12)

గత 70 సంవత్సరాలుగా పల్నాడు ప్రజలు మరి ముఖ్యంగా మాచర్ల,వినుకొండ నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్న వరకపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ ఆవశ్యకతను నారా చంద్రబాబునాయుడు కి వివరించి ప్రాజెక్టు నిర్మించడానికి 1930 కోట్లు కేటాయించెల చేసిన ఘనత రైతు బాంధవుడు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కి దక్కిందని అని ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం మాట నిలబెట్టుకున్న వ్యక్తి మా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కే చెందింది అని యాగంటి వెల్లడించారు. వరకపూడిశెల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఇప్పటికే 350 కేటాయించడం జరిగిందని అది తొందరలో పనులు మొదలుపెట్టి దాదాపు 100000 ( లక్ష )ఎకరాలకి నీరు ప్రవహించేలా చేయడమే కాకుండా మన పల్నాడు ప్రాంత ప్రజలకు త్రాగునీరు,సాగునీరు సమృద్ధిగా అందించడమే మా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మరియు కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గత 16 నెలలుగా మాచర్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని దానికి ముఖ్య కారకుడు మా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అని వెల్లడించారు. మాచర్ల నియోజకవర్గ చదువుకున్న నిరుద్యోగుల కోసం ఇప్పటికే 8 సార్లు జాబ్ మేళా నిర్వహించి దాదాపుగా 3000 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించిన దార్శనికుడు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అని వెల్లడించారు. మాచర్ల నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారని మరియు రైతులు పొలాలకు వెళ్ళుటకు వారి సదుపాయం కొరకు లింకు రోడ్లను నిర్మించిన రైతు బాంధవుడు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ని మరొక్కసారి గుర్తు చేశారు. యువ నాయకులు నారా లోకేష్ బాబు.నేపాల్‌లో దేశంలో అనుకోని హింసాత్మకమైన పరిస్థితులు తయారైనప్పుడు అక్కడ చిక్కుకున్న మన తెలుగు ప్రజలను రక్షించడానికి ప్రత్యేక విమానాలు పెట్టి యుద్ధ ప్రాతిపధకంగా తెలుగు ప్రజలను స్వస్థలాలకు చేర్చి తెలుగు ప్రజలకి ఎక్కడ కష్టమొచ్చినా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది అని నారా లోకేష్ బాబు అది రుజువు చేశారని యాగంటి వెల్లడించారు. ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను నారా లోకేష్ బాబు మరోసారి చాటిచెప్పారు. కంబోడియాలో మోసపూరిత ఉద్యోగాలతో చిక్కుకున్న యువకులను లోకేష్ కాపాడారని, గతంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారి కోసం నారా చంద్రబాబు నాయుడు సొంత నిధులు కేటాయించి వారిని ప్రత్యేక విమానాలు పెట్టి తెలుగు ప్రజలను మన ఆంధ్ర రాష్ట్రాన్నికి తీసుకువచ్చారని అలాగే గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారిని స్వస్థలాలకు తరలింపులో నారా చంద్రబాబు నాయుడు ది కీలకపాత్ర అని యాగంటి వెల్లడించారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉండి వారి ఆస్తులను, మాన.ప్రాణాలను రక్షించిన వాడే నిజమైన పాలకుడు అని కూటమి ప్రభుత్వం అని మరి ముఖ్యంగా నారా చంద్రబాబు ని,పవన్ కళ్యాణ్ ని మరియు నారా లోకేష్ బాబు ని, చూసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. బుద్ధి తెచ్చుకొనివాలి.వైసీపీ నాయకులు అధికారం అంటే దోచుకోవాలి,దాచుకోవాలి జనాల్ని హింసించి వాళ్ళ ఆస్తుల్ని కొల్లగొట్టి, వాళ్లని హింసించాలనే భావన వదులుకోవాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వారి నాయకులకు హితవు పలికారు.గత వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసింది అని కూటమి పార్టీల అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి అని, యువత భవిష్యత్తును బంగారు మయంగా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం అని ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వనిది అని నారా చంద్రబాబునాయుడు ది అని వెల్లడించారు.



**'సూపర్ సిక్స్..సూపర్ హిట్'**

దసరా పండగ రోజున ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న 2 లక్షల 90 వేల మంది ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయలు చొప్పున 450 కోట్లు రూపాయలను వాహనమిత్ర కింద వారి అకౌంట్లో నగదు జమ చేయడం జరుగుతుందని అని ఇచ్చిన హామీలన్నీ కాకుండా కొత్త సంక్షేమాలు పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల అభ్యుదయానికి తోడ్పడుతుంది కూటమి ప్రభుత్వం అని మనసున్న ప్రభుత్వం అని యాగంటి మల్లికార్జునరావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com